ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 16 జులై, 2024 | పేజీలు : 5



## యాదాద్రి వైద్య కళాశాల ఏమైనట్లు?

**ప్రజాపక్షం /భువనగిరి:** యాదాద్రికి మంజూరు అయిన వైద్య కళాశాల ఏమైనట్లు అని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు ఏషాల అశోక్ అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో తెలంగాణ రాష్ట్రంలో కొన్ని మెడికల్ కాలేజీలు మంజూరు చేశారని, మన యాదాద్రి జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు అయినట్లు చెప్పారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలలో మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం స్థలం పరిశీలించార న్నారు. పగిడిపల్లి పాత కలెక్టర్ కార్యాలయ భవనంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం భావించింది కానీ ఈ నాటికి మెడికల్ కాలేజీ ఏర్పాటు పూర్తిగా మానివేశారన్నరు. కాలేజీకి కావలసిన సిబ్బంది, డాక్టర్స్ నియామకాలు కూడా జరిగినవి జాతీయ వైద్య మండలి నిబంధనలకు లోబడి పూర్తిగా మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత

5 లో



## అరకొర సౌకర్యాలతో ఇబ్బంది

### మోడల్ హాస్టల్ విద్యార్థినుల ఆందోళన

### 100 మంది ఉండే హాస్టల్లో 400 మందితో ఎలా ఉండాలి?

**ప్రజాపక్షం/వేములపల్లి :** మండల కేంద్రంలోని మోడల్ హాస్టల్ విద్యార్థినిలు హాస్టల్ ఎదుట ఆందోళనకు దిగారు విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం మోడల్ హాస్టల్ లో 100 మందికి మాత్రమే సౌకర్యంగా ఉండే హాస్టల్ కి గత కొద్ది రోజులుగా తిప్పర్తి కస్తూర్బా గాంధీ హాస్టల్లో ఉంటున్నటువంటి విద్యార్థులను ఇక్కడికి తరలిస్తున్నట్టు ఆ విద్యార్థినిలు అరకొర సౌకర్యాల మధ్య ఉండడం అసౌకర్యంగా ఉంటుందంటూ ఎలా విద్యను అభ్యసించాలని ఆందోళన చెందుతున్నారు, తిప్పర్తి మండలం కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు సుమారు 400 పైగా ఉన్నారని వారందరూ

తరువాయి 5లో



## సైబర్ నేరగాళ్లున్నారు.. జాగ్రత్త!

**ప్రజాపక్షం/కోదాడ:** సైబర్ నేరగాళ్ళ పట్ల పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని పట్టణ సిఐ రాము అన్నారు. సోమవారం పట్టణంలోని సుగుణ కళాశాలలో సైబర్ నేరాలపై పోలీసు కళాజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్నేట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్లతో మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తమ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, ఎటిఎం, ఓటిపి వివరాలను అపరిచిత వ్యక్తులకు చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వేధింపులకుపై 100కు ఫిర్యాదు చేసి సమాచారం ఇవ్వాలన్నారు. యువత డ్రైవింగ్ లైసెన్స్ లేకుడా వాహనాలు నడపవద్దని, చెటు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీస్ కళాబృందం సాంస్కృతిక పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎఎస్ఐ చారి, కళాశాల ప్రిన్సిపల్ ధనీష్, కళాబృందం ఇన్ చార్జీ యల్లయ్య, గోపి, క్రిష్మ, చారి, నాగార్జున ఉన్నారు.



## మరింత బలోపేతానికి కలిసిరండి

**ప్రజాపక్షం /మునుగోడు :** సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిపిఐ మండల కార్యదర్శి చాపల శీను అన్నారు.సోమవారం మండలంలోని చల్మెడలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం పగిళ్ల యాదయ్య అధ్యక్షతన జరిగింది. ఆయన ముఖ్య అతిథిగామాట్లాడుతూ పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ అని సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ఎర్రజెండా ఉంటుందని వారన్నారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి వచ్చిన తర్వాత దేశాన్ని మతతత్వ దేశంగా మార్చడానికి ప్రయత్నం చేస్తుందని అదేవిధంగా ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాయడానికి ప్రయత్నం చేస్తుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి అమలు చేయాలని తక్షణమే ఇల్లు లేని నిరుపేదలకు అర్హులైన వారికి ఇల్లు ఇవ్వాలని తెల్లరేషన్‌కార్డులులేనివారికిరాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని ప్రతి ఒక్క రైతుకు 15 ఎకరాలకు వరకు ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు జిల్లా కౌన్సిల్ సభ్యులు బి లాలు,మండల సహాయ కార్యదర్శి బి యాదయ్య,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సతీష్ కుమార్,గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడు దశరథ,శ్రీపతి గాలయ్య, అశోకు,తదితరులు పాల్గొన్నారు.

**చల్మెడ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక**

మండలంలోని చల్మెడ సిపిఐ గ్రామ శాఖ నూతన కమిటీని సిపిఐ మండల కార్యదర్శి చాపల శీను ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా నందిపాటి అశోక్, సహాయ కార్యదర్శిగా పగిళ్ల యాదయ్య,గాలయ్య, మరో ఐదుగురు తో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## దశాబ్దకాలంగా వివక్షే..

### ఎమ్మెల్యేగారు.. మా ఊరికి రోడ్డు వేయరా!

**ప్రజాపక్షం/తుంగతుర్తి(అర్వపల్లి):** పాలకులు పట్టించుకోకపోవడంతో మండలంలోని వెల్బుచర్ల గ్రామం వివక్షతకు గురవుతుంది. గ్రామ ప్రజలు తమకు ఓటు వేయలేదంటూ గత పాలకులు దశాబ్దకాలంగా ఆ గ్రామ అభివృద్ధిని విస్మరించారు. దీంతో మౌళిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మండలంలోని వెల్బుచర్ల గ్రామంలో దాదాపు వెయ్యి మంది నివాసముంటున్నారు. 450కి పైగా ఓటర్లు ఉన్నారు. కానీ ఈ గ్రామంలో పాలకులు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైందని అందరు అనుకున్న స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ఆ వివక్ష అలానే కొనసాగింది. ప్రతి గ్రామంలో రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన నాటి పాలకులు ఈ గ్రామాన్ని మాత్రం మరచిపోయారు. సూర్యాపేటజనగాం ప్రధాన రహదారి నుండి 1.3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామానికి వెళ్లాలంటే రోడ్డు మార్గం సరిగ్గా లేదు. ఇప్పటికి మట్టిరోడ్డే ఉంది. చినుకు పడితే ఆ రోడ్డు చిత్తడిగా మారుతుంది. ఆ గ్రామానికి

తరువాయి 5లో

# నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని, ఈ ప్రజా పాలనలో ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వారికి సరైన న్యాయం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపు నిచ్చారు. సోమవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ కు బయలుదేరిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్,చెరుకు శివరాజ్ లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగులో ఉన్న 8 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్మెంట్ , స్కాలర్షిప్ లు అందకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పేద విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కాబట్టి సమస్య పరిష్కారం కోసం నూతన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో పెయింటింగ్స్ స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.




## విద్యార్థులకు ప్లేట్లు, స్టేషనరి పంపిణీ



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని కక్కిరేణి గ్రామంలో బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పీవీపీఎంరావు మెమోరియల్ పీకే మెహర్ సహకారంతో సోమవారం ప్రాథమికోన్నత పాఠశాల విద్రాయ్థులకు భోజన ప్లేట్లు, స్టేషనరీ సామాగ్రితోపాటు అంగన్‌వాడి విద్యార్థులకు ఆట వస్తువుల కిడ్స్ పంపిణి చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ బెస్ట్ సేవా సొసైటీ గత నాలుగు సంవత్సరాలుగా అనేక సేవ కార్యాక్రమాలు చేపడుతుందన్నారు. పేదల అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కర్నాటి వెంకటేశ్వర్లు, ఆర్గనైజర్ వేముల సైదులు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ చిల్ల ప్రేమలత, ప్రభావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులుహనుమంతరావు, రాజన్‌బాబు, భద్రయ్య, గణేష్, గోపాల్‌రెడ్డి, కృష్ణ, రాజు, రమేష్, శివకుమార్, స్వప్న, అంగన్‌వాడి టీచర్స్ గోవర్ధనమ్మ, యశోద, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## 24గంటల వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని మునిపంపుల గ్రామ ప్రభుత్వ ఆసుపత్రిలో 24గంటల పాటు ప్రజలకు వైద్య సేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరు బాట కార్యక్రమంలో భాగంగా మునిపంపుల పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. 21 సంవత్సరాల క్రితం పరిసర గ్రామాలకు వైద్య సేవల నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రభుత్వాసుపత్రికి నిత్యం వంద మంది బయటి రోగులు వస్తుంటారని, కాని ఆసుపత్రిలో ఒక డాక్టర్, ఒకే నర్సు ఉండడంతో సదుపాయాలు లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాదులను దృష్టిలో ఉంచుకోని ఆసుపత్రిలో ప్రజలకు 24 గంటల వైద్యం అందించాలన్నారు. తొలుపునూరి శ్రీనివాస్, తాళ్లపల్లి జితేందర్, చంద్రశేఖర్, మైనొద్దిన్, రమేష్, బాషయ్య, యాదగిరి, సంధ్య, భరత్, దినేష్ సందీప్‌ఉన్నారు.

## రావూరి నర్సింహారావు ఆశయ సాధనకు కృషి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ రూరల్:** రావూరి నర్సింహరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగగిరి గ్రామంలో నిర్వహించిన రావూరి నర్సింహరావు సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతం లో దొరలు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలకు రూపకల్పన చేసి ప్రజా ఉద్యమాలు నడిపిన ఘనత రావూరిది అని అన్నారు. రైతులు, రైతు కూలీల పక్షాన పోరాటాలు చేసి ఈ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారని, ఈ గ్రామంలోప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా క్రీడలు నిర్వహించేవారని, ఈ ప్రాంతంలో ఎంతో మంది పార్టీ నాయకులుప్రజాప్రతినిధులుగా ఎన్నికకావడంతో రావూరి నర్సింహరావు ఎంతో కృషి చేశారని అన్నారు. లింగగిరి గ్రామ సిపిఎం పార్టీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన చివరి వరకు కమ్యూనిస్టు పార్టీలోనే ఉన్నారని అన్నారు. రావూరి స్ఫూర్తితో భవిష్యత్‌లో ప్రజా పోరాటాలు నిర్వహించి రావూరి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సీపీఎం నాయకులు ఎల్లంశెట్టి వీరస్వామి, పల్లె వెంకటరెడ్డి, దుర్గి బ్రహ్మం, పోసనబోయిన హుస్సేన్, వట్టెపు సైదులు, మంత్రిప్రగడ రాంబాబు, నవతెలంగాణ ఉమ్మడి జిల్లా మేనేజర్ పుప్పాల మట్టయ్య, సిఐటియు నాయకులు శ్రీలం శ్రీను, బండి గోపి, నూకల లక్ష్మి నర్సింహ, బుజ్జిబాబు, నర్సింహరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మరికొన్ని రోజులు ప్రజల చెంతనే వైద్యులు





**ప్రజాపక్షం/మునగాల:** గ్రామంలోని ప్రజలందరికి విష జ్వరాలు తగ్గుముఖం పట్టాయని, ఇంకా కొన్ని రోజులు వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తారని సూర్యాపేట జిల్లా డిఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాడ్వాయి గ్రామంలో గత 15 రోజులుగా గ్రామంలోని ప్రజలకు విష జ్వరాలు సోకడంతో గ్రామంలో పెద్ద ఎత్తున హెల్త్‌క్యాంపు జరుగుతున్న విషయం తెలుసుకున్న ఆయన ఉదయం గ్రామానికి చేరుకుని ప్రజలతో మాట్లాడారు. గ్రామంలోని వీధులను, పరిసరాలను పరిశీలించి వైద్యం అందుతున్న రోగులతో వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విధుల విషయంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్లవేళలా ప్రజలకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాజీయా, జిల్లా మాస్ మీడియా అధికారి అంజయ్య, ఎపిడమాలజిస్టు సతీష్, ఎంపిడివో రమేష్‌దీన్‌దయాల్, డాక్టర్ శ్రీశైలం, వినయ్‌కుమార్, వైష్ణవి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.సుదర్శన్, మాజీ వైస్ ఎంపిపి కొలిశెట్టి బుచ్చిపాపయ్య, వైద్య సిబ్బంది లింగం రామకృష్ణ, శారధ, శ్రీనివాస్, లింగయ్య, ఎఎన్‌ఎం సుచరిత, మమత, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్:** సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌వో కోటచలం అన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్కవరం గ్రామంలో స్పెషల్ డ్రైడే అమలు తీరును పరిశీలించి, డెంగ్యూ, జ్వర బాధితుల ఇంటింటికి తిరిగి వారిని పరామర్శించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామంలో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహణ, మురుగునీరు పారుదలపై గ్రామ ప ంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామంలో పరిస్థితి అదుపులోకి వచ్చేంత వరకు హెల్త్ క్యాంపును కొనసాగించాలని, జ్వర పీడితుల నుండి రక్త నమూనాలను సేకరించాలని వైద్య సిబ్బందికి అదేశాలు ఇచ్చారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి రెప్పలా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డెమో అంజయ్య, ఎపిడిమాలజిస్టు సతీష్, డాక్టర్ పుష్పలత, ఇన్‌ఛార్జి ఎంపిడి గిరిబాబు, సూపర్‌వైజర్లు సిహెచ్ పద్మ, అంజయ్య, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి, శ్రీనివాస్, వరలక్ష్మి , సావిత్రి, వెంకన్న, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెల్లరేషన్‌కార్డు తప్పనిసరి చేయడం సరికాదు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న రెండు లక్షల రూపాయల రుణమాఫికి అర్హత గల తెల్లరేషన్‌కార్డు ఉ ండాలన్న నిబంధన సరైంది కాదని తెలంగాణ రైతు సంఘం మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ సుంకర క్రాంతికుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో రైతులందరికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ వర్తింప చేయాలని, రేషన్‌కార్డు నిబంధన పెట్టడం సరైంది కాదన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు రాలేదని, కొందరు ప్రభుత్వ ధనాన్ని వృధా చేయటం ఇష్టం లేక తీసుకోలేదని, అలాగని రేషన్‌కార్డు ఉన్న వారికే రుణమాఫీ వర్తింప చేస్తామనడం సరైన పద్దతి కాదన్నారు.

## పేదలను ఆదుకోవడమే లక్ష్యం

### కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/మునగాల:**పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన వెంపటి నర్సయ్య సిఎం రిలిఫ పండ్‌కు దరఖాస్తు చేసుకోగా 65వేల రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం నర్సయ్యకు 65వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్సూర్, వెంకటేశ్వర్లు, మచ్చ జానయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంకల్ప ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని సంకల్ప ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను సోమవారం వైద్యులు విజయవంతంగా చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్ళచెరువు మండలం రామాపురం గ్రామానికి చెందిన సైదారావు అనే వ్యక్తి బైక్ అదుపు తప్పి కింద పడడంతో మోకాళ్లకు గాయమైంది. మోకాలుకు ఉన్న నరాలుతెగిపోవడంతో సంకల్ప ఆసుపత్రి చికిత్స కోసం చేరగా వైద్యులు సందీప్ రెడ్డి, కార్తీక్ అతనికి శస్త్ర చికిత్స చేశారు. డాక్టర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఇది చాలా అరుదైన శస్త్ర చికిత్స అని చెప్పారు.తాము మొదటిసారిగా చేసినట్లు తెలిపారు.

## యువనాయకుల ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** నిరుద్యోగుల కోసం పోరాడుతున్న బిఆర్ఎస్ యువజన నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అక్రమమని మండల బిఆర్ఎస్ యువ నాయకులు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల కోసం డీఎస్సీ తదితర పోటీ పరీక్షలను వాయిదా వేయాలని ఆ పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో గులాబీ పార్టీ యువ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు చిలువేరు శేఖర్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు చింతకింది కిరణ్ ,మండల పార్టీ అధ్యక్షులు కల్యాకరి శ్రీకాంత్,సిద్దుల ప్రభాకర్ లు అరెస్టు అయ్యారు.

# నీటి నిల్వల వల్లే డెంగీ విజృంభణ



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** వర్షాభావంతో రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు విష జ్వరాలు ప్రభలే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో, మున్సిపాలిటిలో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని కోరారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోఅందుబాటులోఉంచాలన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలుమారసానిచంద్రకళ, సూరం రేణుక, సయ్యద్, గులాం, రామోజీ, వాజిద్, పరశురాం పాల్గొన్నారు.

## లారీ అదుపుతప్పి చెరువులోకి పల్టీ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ఇటుక లోడు లారీ స్టీరింగ్ విరిగి అదుపుతప్పి ఇంజన్ బాడీ వేరయ్యి చెరువులోకి పల్టీ కొట్టిన ఘటన భూదాన్ పోచంపల్లి మండలం జలాల్పురంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలోకి వెళితే కుషాయిగూడ ఇటుక అడ్డాకు చెందిన లారీ ఇటుక కోసం నారాయణగిరిలోని ఇటుక బట్టిలో ఇటుకలోడు వేసుకొని తిరిగి కుషాయిగూడ వెళ్తున్న క్రమంలో మోడల్ స్కూల్ పోచంపల్లి రుద్రవెల్లి మీదుగా ఘ్కసర్ వెళ్దాం అనుకున్న డ్రైవర్ పవన్ జలాల్ పురం చెరువు కట్ట మూల మలుపు వద్ద స్టీరింగ్ తిప్పే క్రమంలో స్టీరింగ్ రాడ్డు విరగడంతో ఒక్కసారిగా లారీ అదుపుతప్పింది.లారీలో భారీ ఇటుక లోడ్ వేగం ఉండటంతో ఇంజన్ నుండి బాడీ విడిపోవడంతో ఇంజన్ సరాసరి చెరువులోకి దూసుకెళ్లింది. బాడీలో ఉన్న ఇటుకలోడు మొత్తం చెరువు కట్ట రోడ్డుపైపడిపోయింది. ఇంజన్‌తో సహా చెరువులో పడ్డ డ్రైవర్ పవన్ డోర్లు తీసుకొని వెంటనే చాకచక్రంతో ప్రమాదం నుండి బయట పడ్డాడు. ఆ సమయంలో రోడ్డుపై ఏ వాహనాలు వెళ్లకపోవడంతోప్రమాదం తప్పింది.ఈ మేరకు ఎస్సు భాస్కర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూలీలకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

ప్రజాపక్షం /ఆలేరుఃఉపాధిలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌలు మండల అధ్యక్షులు బొమ్మగటి లక్ష్మి నారాయణ అన్నారు. సోమవారం ఆలేరు మండలం లో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్కు వినతి పత్రం అందజేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఉపాధి హామీ పనికి సరైన వేతనం ఇయ్యకపోవడం అదేవిధంగా చేసిన కూలీకి బిల్లులు పంచకపోవడం బాధాకరమన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలు చేస్తున్న పనికి బిల్లులు మంజూరు చేసి వెంటనే విడుదల చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మిట్ట బిక్షపతి చెక్కిళ్ల నాగులు మేకల బిక్షపతి దళిత అంజమ్మ గౌరమ్మ జూకంటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## కూరెల్ల, రాఘవపురం మధ్య వంతెన నిర్మించేదెప్పుడు?




**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** మండలంలోని కూరెళ్ళ, రాఘవాపురం గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ శాఖ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి,మండల కార్యదర్శి వేముల భిక్షం మాట్లాడుతూ, నిత్యం రహీంఖాన్ పేట, నర్సాపురం, రాఘవపురం గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ వాగు నుండి అనేక మంది తమ అవసరాల కోసం ప్రయాణిస్తారని,వర్షాకాలంలో వాగులోని నీళ్లు వంతెన పై నుండి పోవడం వలన ప్రజలు తమ రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు , గ్రామ శాఖ కార్యదర్శి తూమ్మలగూడెం యాదయ్య ,సిపిఎం నాయకులు, బి రాములు,బి ఐలయ్య,రేసు యాది రెడ్డి, పొన్నం రాజామల్లు, ఎం సత్తయ్య, కె అంజయ్య, కె శంకరయ్య, ఎం భిక్షం,పొన్నం అండాలు,ఎడ్ల నర్సి రెడ్డి,ఎన్ ఉప్పలయ్య బుర్ర రాకేష్, కొంపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాటల పునరుద్ధరణకు ధర్నా



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని జేత్యా తండా గ్రామంలో గత 35 సంవత్సరాలుగా బీసీల కాలనీకి నడుస్తున్న బాటను కొందరు మూసి వేయడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ బాటను కొందరు అక్రమంగా మూసివేయడంతో తండాలోని బీసీ కాలనీలో ఉంటున్న 45 కుటుంబాల వారు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాల కోసం సొంత పట్టా భూమిని సర్వే నెం.444లో గల భూమినిత ప్రభుత్వానికి అప్పట్లో దానం చేయగా ఆ భూమిలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను కట్టించి ఇవ్వడంతో తాము అక్కడే నివాసం ఉంటున్నారన్నారు. రాజకీయ కక్షతో కొందరు బాటకు ముళ్ల కంచెలు వేయడంతో రాకపోకలు సాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే అధికారులు స్పందించి బాటను పునరుద్ధరించి కాలనీవాసుల ఇబ్బందులు తొలగించాలన్నారు. కార్యక్రమంలో పోతుగంటి కాశీ, వస్కుల సైదమ్మ, నాయకులు చిర్ర మల్లేష్, శ్రీను, నాగయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్‌సి ప్రకటించాల్సిందే




**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సిని వాయిదా వేసి 25వేల ఉద్యోగాలతో మెగా డిఎస్‌సిని ప్రకటించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలెబోయిన కిరణ్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు నాగయ్యలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరసన తెలిపిన డిఎస్‌సి అభ్యర్థులతో పాటు పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఇందురు సాగర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పోరాట ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందని గుర్తు చేశారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పాలకులు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, మందడి శ్రీధర్, శ్రీను, మధు, రమేష్ పాల్గొన్నారు.

## 25న అవార్డులు అందజేత



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** వి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన హైదరాబాద్ లోని హోటల్ సుప్రభాత్ హబ్సిగూడ నందు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో నిష్టాతులై ప్రతిభ కనభరుస్తున్న వారికి ప్రతిభ సేవా అవార్డులు అందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని వి ఆర్ ఫౌండేషన్ కమిటీ నుండి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలసి ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో జిసియస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ వి ఆర్ శ్రీనివాస్ రాజు,ముఖ్య కార్యదర్శి మధుకర్ గౌడ్,జూరీ కమిటీ సభ్యులు ప్రసాద్,అడ్వాయి అడ్వయిజరీ బోర్డు కమిటీ సభ్యులు కానుగంటి శ్రీశైలం,అడ్వయిజరీ కమిటీ సభ్యులు నల్ల చంద్రస్వామి మాదిగ,ప్రభాకర్ రెడ్డి,రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రాణవాయువుకు వర్షాలకు మూలం మొక్కలు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని అవి ప్రాణవాయువుకు వర్షాలకు మూలమని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి పురపాలక పరిధిలో గల శ్రీ బుగ్గ రామన్న దేవాలయానికి వెళ్ళే మార్గములో ఉన్న వెంచర్ లోని మున్సిపల్ భూమిలో ఆమె మొక్కలు నా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె వీరా రెడ్డి ,వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు గుండు మధు , దేవరాయ కుమార్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పట్టవా?

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల టీచర్ల, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి అన్నారు. సోమవారం వారు అంగన్‌వాడి సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. అంగన్‌వాడిలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు అందించాలని, పదోన్నతులు కల్పించాలని, జీవో నెం.10ను రద్దుచేయాలని, జీవో నెం.11ను సవరించాలని, గ్రాడ్యుటి చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడిల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బొందు పార్వతి, బెజ్జం నాగమణి, స్వరాజ్యం, రషీదాబేం, గుంటి విజయ, రాధాబాయి, వసీమాబేం, లక్ష్మి, నాగమ్మ, చంద్రకళ, జ్యోతి, యాదమ్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంతోషిమాత ఆలయంలో వారాహి నవరాత్రోత్సవాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో ఆషాడ మాసం ప్రారంభం మొదలుకోని వారాహి నవరాత్రి ఉత్సవాల ముగింపునునిర్వహించారు. దేవాలయ అర్చకులు భట్టరం వంశీకృష్ణ శర్మ ముగింపు ఉత్సవాల్లో పంచామృత అభిషేకం, అమ్మవారికి షోడోపచార పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేసి శ్రీ వారాహి మాత బీజాక్షరాలతో హోమం, మహా పూర్ణహుతి నిర్వహించారు. ఈనెల 17న ఆలయంలో తొలి ఏకాదశి పూజలు ఉదయం 6 గంటల నుండి ప్రారంభం కానున్నాయి.

# గోపలాయపల్లిలో ప్రారంభమైన రుద్రయాగం



ప్రజాపక్షం /నార్కట్ పల్లి : మండలం పరిధిలోని గోప్లాయిపల్లి గ్రామంలో గల శ్రీ వారి జాల వేణుగోపాల స్వామి దేవస్థానం నందు వారం రోజుల పాటు జరగనున్న కార్యక్రమాల ప్రారంభోత్సవానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్యఅతిథిగా విచ్చేశీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో శ్రీ హరి హర వేద స్మార్త పాంచ రాత్ర ఆగమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మ శ్రీ చే బియ్యం రాఘవ శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మ శ్రీ శ్రీ కృష్ణ ఘణ పాటి బ్రహ్మ త్వం లో సుదర్శన యాగ సహిత రుద్రయగం మరియు శ్రీ కృష్ణ యజుర్వేద,క్రమ స్వస్తి, పూర్వక వేద పారాయణం ఋగ్వేద,పారాయణం సప్తాహ దీక్ష తో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ధర్మపత్ని రాజేశ్వరి దేవి, నార్కట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బత్తుల ఉషయ్య,జెర్రిపోతుల భరత్, వేదపండితులు వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శాంతికి, మతసామరస్యానికి ప్రతీక



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని 12వ వార్డులో మొహరం వేడుకల్లో ఆలేరుశాససనభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. పవిత్ర యుద్ధంలో అమరులైన మహమ్మద్ అసైన్, హుస్సేన్ అన్నదమ్ముల అమరుల జ్ఞాపకార్థం నిర్వహించే ఈ పండుగలో హిందూ ముస్లిం కలిసి ఘనంగా నిర్వహించుకుంటూ శాంతికి, మతసామరస్యానికి ప్రతీకగా ఈ వేడుక జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వలిగొండలో వాహనాల తనిఖీ

ప్రజాపక్షం /వలిగొండ: వలిగొండ మండల కేంద్రంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. సోమవారం వలిగొండ ఎస్సై డి. మహేందర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై జరిమానా విధించారు. అనంతరం ఎస్సై డి. మహేందర్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా బండి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు.

## ఆభయహస్తం హామీలు అమలు చేయాలి

ప్రజాపక్షం / మాడుగుల పల్లి : ముదిరాజులకు ప్రభుత్వం ఇచ్చిన అభయ హస్త ము హామీలను అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు తవిటి సైదులు ముదిరాజు కోరారు. మండల తాసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియచేయడం కోసం సోమవారం మాడుగులపల్లిమండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. సైదులు ముదిరాజు మాట్లాడుతూ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఆదేశాలుజిల్లా అధ్యక్షులువెలుగు రవి ముదిరాజ్ సూచనల మేరకు ప్రభుత్వం అభయహస్తంలో పేర్కొన్న బీసీ డీ నుంచి బీసీ ఎ లోకి మార్చడం, కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంవత్సరానికి 1000 కోట్లు నిధులు కేటాయించాలని అలాగే మత్స్యకారుల అభివృద్ధికోసంనిధులుమంజూరు చేయాలన్నారు.

## నాణ్యమైన విత్తనాల సరఫరాకు డిమాండ్



ప్రజాపక్షం/భూదాన్‌పోచంపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని నకిలీ విత్తనాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సుంకేటి అన్వేష్ రెడ్డికి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డి సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు.విత్తన సంస్థ చైర్మన్ గా నియమితులైన అన్వేష్ రెడ్డి హైదరాబాదు హాకా భవన్ ప్రధాన కార్యాలయంలో తనపదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయనతో రైతులకు సకాలంలో సంక్షేమ ఫలాలను అందించాలని అన్ని రకాలుగా ఆదుకోవాలని ,రైతు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాపక్షం/చింతపల్లి : చింతపల్లి మండల ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బివిఎన్‌రెడ్డి నీలాద్రి ఆసుపత్రి, గొడకొండ్ల వెంకశ్వరనగర్ పద్మావతి ఆసుపత్రి నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరాన్ని చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి ప్రారంభించారు. యాదగిరి మాట్లాడుతూ ప్రెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తమ కలం ద్వారా ప్రజలను చైతన్యం చేయడమే కాకుండా సామాజిక సేవ చేయడం అభినందనీయం అన్నారు. 450 మంది పేషెంట్లుకు నీలాద్రి ఆసుపత్రి, పద్మావతి ఆసుపత్రుల నేతృత్వంలో బిపి, షుగర్ టెస్టులు నిర్వహించి మందులు అందించారు. డాక్టర్లు రోగులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఎస్ఐ యాదగిరి, డాక్టర్ సిద్ధార్థ్, ఆశ, సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేష్, ఓంకార్, రాజు ఉన్నారు.

# ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి



ప్రజాపక్షం /మోటకొండూరు: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజులకు హామీ ఇచ్చిన ప్రకారం అభయా హస్తం పథకం అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు కొల్పుల హరినాథ్ ముదిరాజ్ అన్నారు. మండల రెవెన్యూ అధికారుల ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి ఈనెల 15 నుంచి 20 వరకు వినతి పత్రాలను అందించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రం వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముదిరాజుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముదిరాజ్ అభయ హస్తం హామీలైన జీవో 15 ప్రకారం బీసీ డి నుంచి బీసీ ఏ లోకి పునరుద్ధరణ చేసి తక్షణమే మార్చాలన్నారు. ముదిరాజుల అభివృద్ధి కోసం ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఏడాదికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని , చెరువుకుంటలపై, మత్స్య సంపద పై ముదిరాజ్, ముదిరాజ్ ఉప కులాలకు మాత్రమే వర్తించే విదంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా మహిళా అధ్యక్షురాలు బోయిని ఝాన్సీ, జిల్లా నాయకులు జోరుక ఎల్లేష్, భువనగిరి ఎల్లయ్య, గిరబోయిన మల్లయ్య, మానేగల్ల విక్రమ్, మారబోయిన శ్రీనివాస్, పేరబోయిన కార్తీక్, రాగుల బిక్షపతి, చొప్పరి మారయ్య, భువనగిరి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకు బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలి



ప్రజాపక్షం /భువనగిరిరూరల్: కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేనేతకు బడ్జెట్లో 1000 కోట్లు కేటాయించే విధంగా చూడాలని భువనగిరి శ్రీనివాస్ నేత, కర్నాటి ధనంజయనేత అన్నారు. సోమవారం హైదరాబాదులో ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జియో ట్యాగ్ మగ్గాల పై తయారైన ప్రతి వస్త్రాన్ని గవర్నమెంట్ కొనేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలోనే అతి పెద్దదైన కనుముక్కల హైండు లూమ్ పార్క్ ను పునరుద్ధరింప చేసి 5000 మంది మగ్గం కార్మికులకు పని కల్పించాలన్నారు. చేనేత బీమా పథకాన్ని 75 సంవత్సరాల వరకు పెంచాలని, హెల్త్ కార్డులు పునరుద్ధ రింపజేయాలన్నారు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందించాలని కోరారు. అనంతరం ఇటల రాజేందర్ ను శాలువాతో సన్మానం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర మాధ వెంకన్నలు, బి రాజేశం నర్సింగరావు, భువనగిరి శ్రీనివాస్ నేత, రచ్చ శ్రీనివాస్ నేత, కర్నాటి ధనంజయనేత, బొమ్మ రఘురాం నేత, గాడి పెల్లి పరమేశ్వర్ నేత, వన్నల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొహర్రం పండుగ



ప్రజాపక్షం / భువనగిరి: భువనగిరి లోని సమద్ చౌరస్తా వద్దగల అశుర్ ఖనలో ముఖ్య అతిథిగా విచ్చేసిన పీసీసీ డెలిగేట్ మెంబర్ తంగెళ్ల పల్లి రవికుమార్ సోమవారం దట్టి కట్టారు. మొహర్రం పండుగను కుల మతాలను అతీతంగా జరుపుకోవడం ఆనవాయితిగ ఉందని తెలిపారు. భువనగిరి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ కౌన్సిలర్ నజిమసలాఉద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జలీల్, నాయకులు మసూద్, ముతవల్లీలు ప్రజలు పాల్గొన్నారు.

## సాగుపనిలో ఎమ్మెల్యే సామేలు




ప్రజాపక్షం/అడ్డగూడూరు: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలో తుంగతుర్తి శాససనభ్యులు మందుల సామేలు సోమవారం తన సొంత ఊరిలో ధర్మారం గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో నాట్లు వేస్తూ కూలీలతో కలిసి పనిలో నిమగ్నమైన రోజంతా గడిపారు. వ్యవసాయంలో ఉన్న ఆనందం దేనిలో ఉండదని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రుణమాఫీ చేసి తీరుతామని తెలిపారు.

## నక్షబాట ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాపక్షం/తుర్కపల్లి: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్‌రెవెన్యూలోని సర్వేనం 105, 106లలో ఉన్న రైతులు వారి భూమిలోకి పోవడానికి గ్రామ ప్రభుత్వ నక్షబాటును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రీవెన్సుడే రోజున జిల్లా కలెక్టర్ కు బాధిత రైతులు అన్నం ఇంద్రారెడ్డి,గుజ్జుక సాయికుమార్,గుజ్జుక మహేష్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.కలెక్టర్ స్పందిస్తూ తహశీల్దార్‌కి ఫోన్ చేసి సమస్యను ప్రస్తావిస్తూ భాద్యులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు.

# అధిక ఫీజు వసూళ్ల పాఠశాలలపై చర్యలకు డిమాండ్

**ప్రజాపక్షం/దేవరకొండ:** నియోజకవర్గంలోని బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడాన్ని నిలుపుదల చేయాలని ఆర్డీవో బాణావత్ శ్రీరాములుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం సామాజికవేత్త రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన నియోజకవర్గంలో నిరుపేదలైనటువంటి ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ పిల్లలు ఉండడం వలన ఆర్థిక స్తోమత లేక కార్పొరేట్ పాఠశాలలో చదువుకోలేక మెరుగైన చదువు కోసం ప్రైవేటు పాఠశాలలకు వెళితే పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ నిరుపేదలను చదువుకు దూరం చేస్తున్నారని తక్షణమే నియోజకవర్గంలో ఉన్న



టువంటి ప్రైవేటు పాఠశాలల యాజమన్యాలతో సమీక్ష నిర్వహించి ఫీజులను నియంత్రించాలని ఆర్డీవోను కోరారు. లేని పక్షంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ప్రధానకార్యదర్శి చోల్లోటి భాస్కరాచారి, నాయకులు చంద్రమౌళి, నాగయ్య, జయలక్ష్మి, కృష్ణాచారి, సత్యం, రజినికాంత్, కృష్ణ, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నాయిబ్రాహ్మణ భవనానికి భూమి కేటాయించాలి

**ప్రజాపక్షం /మాడుగులపల్లి :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో నాయి బ్రాహ్మణుల భవనానికి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమిలో రెండు గుంటల భూమి ని కేటాయించాలని నాయి బ్రాహ్మణ మండల అధ్యక్షులు పిల్లుట్ల శ్రవణ్ ఆధ్వర్యంలో ప్రజావాణి లో ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. పిల్లుట్ల అశోక్, పిల్లుట్ల సందీప్, జంపాల నరేష్, మిడసనమెట్ల జగదీష్, తదితర నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## అంగన్వాడి బాట ర్యాలీ

**ప్రజాపక్షం / మాడుగులపల్లి :** ప్రభుత్వ ఆదేశానుసారం 15, 20 తేదీ వరకు నిర్వహించనున్న అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాల అంగన్వాడి టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3 నుండి 6 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని అన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు.టీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

## వరుణ యాగ పూజలు

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** తెలంగాణలో ప్రసిద్ధ క్షేత్రమైన మండలం పరిధిలోని చెరువుగట్టు గ్రామాన గల శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఈ ఏడాది వర్షాలు కురవక రైతంగం ఎదుర్కొంటున్న కష్టల నుండి విముక్తి కల్గించేందుకు వర్షాలు కురవాలని దేవస్థానములో ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు.దేవస్థాన ప్రధాన అర్చకులు పోతులేటి రామలింగేశ్వర శర్మ వర్షాల కోసం వర్షాలు కురవాలంటూ వరుణ యాగ కార్యక్రమంను చేపట్టారు. చెరువుగట్టు గ్రామ మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, యువ నాయకుడు శశిధర్‌రెడ్డి,గ్రామస్థులు వరాల రమేష్, రెగట్టే రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌కు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన ఎండి. రియాజ్‌కు కాంగ్రెస్ నల్గొండ పార్లమెంట్ కన్వీనర్ ఎంఏ సిరాజ్‌ఖాన్ శుభాకాంక్షలు తెలిపారు. సిరాజ్‌ఖాన్ మాట్లాడుతూ టిపిసిసి అధికార ప్రతినిధిగాపని చేసినేడుగ్రంథాలయ చైర్మన్‌గా రియాజ్ పదవి బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

## రెండోసారి మోకాలు మార్పిడి చికిత్స విజయవంతం



**ప్రజాపక్షం /చండూరు:** చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో గల గగన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో రెండవసారి మోకాలు మార్పిడి చికిత్స విజయవంతంగా జరిగింది.ఆర్థోపెటిక్ డాక్టర్ మల్లికార్జున్ , ఆర్థోపెడిక్ డాక్టర్ ఉమా మహేష్ , అనస్తిసి యా. డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ల బృందం ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. మోకాలు మార్పిడి ఆపరేషన్ రెండోసారి విజయవంతంగా పూర్తి చేసిన గగన్ మల్టీ వెస్టి హాస్పిటల్ బృందాన్ని, అతి తక్కువ ఖర్చుతో మన పట్టణంలోనే ఆపరేషన్ చేసిన హాస్పిటల్ యాజమాన్య నిర్వాహకులను పట్టణ ప్రజలు అభినందించారు. మోకాలు మార్పిడి చికిత్స అవసరమా వారు తమ హాస్పిటల్ కి వచ్చి అతి తక్కువ ఖర్చుతో మోకాలు మార్పిడి చికిత్స చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## గ్రూపు 2,3వాయిదా వేయాలి

**ప్రజాపక్షం / మాడుగుల పల్లి :** గ్రూప్ 2,గ్రూప్ 3 పరీక్షలు వాయిదా వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లెంల శ్రీకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిరుద్యో గులు చేస్తున్న నిరసనకు వెళ్ళకుండా అక్రమ అరెస్టు చేసి మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్లో బంధిం చడాన్నిఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి 5 వరకు డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తున్నది. ఆ వెంటనే ఆగష్టు 7,8 తేదీల్లో గ్రూప్ 2 గ్రూప్3పరీక్షలు తేదీలు ప్రకటించారు.రెండు పరీక్షలు వెంట వెంటనే వస్తే ప్రిపేర్ ఎలా అవుతారని ప్రశ్నించారు.ముందస్తు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ,బీసి సంఘం జిల్లా నాయకులు తండు లింగయ్య,ఊరిబిండి శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

## ఇండేన్‌మనీపై అసత్య ఆరోపణలు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలోని ఇండెన్ మనీ ప్రైవేట్ లిమిటెడ్‌లో భారీ కుంభకోణం జరిగినట్లు వచ్చిన వార్త కథనాల్లో వాస్తవం లేదని బ్యాంకు అధికారులు తెలిపారు. సోమవారం సంబంధిత అధికారులు ఇండేన్ మనీ ప్రైవేట్ లిమిటెడ్‌లో విచారణ నిర్వహించారు. బాధితులు తాము తీసుకున్న రుణానికి ప్రతి నెల వడ్డీ కట్టకపోవడంతో వడ్డీ రేటు పెరిగినట్లు తెలిపారు. బాధితులు కుడా తప్పులేదని విచారణ సమయంలో చెప్పినట్లు తెలిపారు. ఇలాంటి తప్పుడు ఆసత్య ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని, ఏదైన సమాచారం కావాలంటే నేరుగా తమ కార్యాలయానికి వచ్చి తెలుసుకోవాలని జోనల్ మేనేజర్ రమేష్ రాజు తెలిపారు.

## ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్):** ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ ఫాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి నాగయ్య అన్నారు. సోమవారం మండలంలోని పోట్లపహాడ్ గ్రామంలో ఎగ్గడి యాదగిరి నూతనంగా సాగు చేస్తున్నా ఆయిల్ ఫాం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు మొక్కలు నాటేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫాం మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల తరువాత దిగుబడి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు బిందు సేద్యం, ఎరువులకి, అంతర్గత పంటలకు రాయితీ ఇస్తుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యావన అధికారి కన్న జగన్, మండల వ్యవసాయ అధికారి సందీప్, ఎఈఓ శైలజ, పతాంజలి ఆయిల్ ఫాం కంపెనీ ప్రతినిధులు హరీష్, శశి కుమార్, లక్ష్మి నారాయణ, రైతులు తూము ఇంద్రసేనారావు, నవీన్, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేయండి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేయండి వారి బంగారు భవితకు పునాది వేయండి అని పెండ్లీపాకుల మాజీ ఎంపిటిసి నేనావత్ రజిత అన్నారు. సోమవారం గుడితండాలో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది గ్రామ ప్రజలు, అధికారులు, చిన్నారులు వారి తల్లితండ్రులతో కలిసి గుడితండాలో ర్యాలీ నిర్వహించారు. రెండు సంవత్సరాలకు పై బడిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ నేనావత్ విజయ విద్యార్థుల తల్లితండ్రు




లను కోరారు. ఈ కార్యక్రమంలో గుడితండా స్పెషల్ ఆఫీసర్ సతీష్, సెక్రటరీ నగేష్, మత్స్యశాఖ చైర్మన్ బాలునాయక్, మాజీ ఎంపిటిసి శంకర్‌నాయక్, అమర్‌సింగ్, ఆయా బాజు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి వైద్య కళాశాల ఏమైనట్టు?

(1వ పేజీ తరువాయి)

ఈ ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ జిల్లాకు మంజూరు అయిన మెడికల్ కాలేజీని ప్రారంభం చేయుటకు నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఈ సంవత్సరం కాలేజీ మన జిల్లాలో నడవడం చాలా కష్టంగా అగుపడుతున్నది, కొత్తగా ఏర్పడిన వైద్య కళాశాలలు వివిధ జిల్లాల్లో ఏర్పాటు జరుగుతున్నవి ఈ జిల్లాలో కదలిక లు పూర్తిగా లేవు ఏర్పాట్లు ఎలా ఉన్నాయో చూడటానికి వచ్చిన వైద్యశాఖ అధికారులు పగిడిపల్లి వద్ద గేటుకు తాళాలు చూసి ఆశ్చర్యపోయారన్నారు. పాత కలెక్టర్ భవనానికి మెడికల్ వైద్య కళాశాల బోర్డు కూడా పెట్టారు ఈ సంవత్సరం కళాశాల కొనసాగించుట కు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే అన్ని విధాల వసతులు కల్పించుటకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణం చేయుటకు పక్కా భవనాల కోసం స్థలసేకరణ జిల్లా ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని పూర్తి చేయాలని పక్కా భవనాల నిర్మాణానికి పూనుకోవాలని మెడికల్ కాలేజీని ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అరకొర సౌకర్యాలతో..

(1వ పేజీ తరువాయి)

మోడల్ హాస్టల్ లో కి తరలించే విధంగా ప్రయత్నాలు చేస్తుండడంతో అంతమందితో వేములపల్లి మండల కేంద్రంలోని మోడల్ హాస్టల్ అంతంత మాత్రమే ఉందని ఇప్పటికే ఒక్కో రూమ్ లో పది మంది చొప్పున ఉండాల్సి వస్తుందని అన్నారు మోడల్ హాస్టల్లో కష్టంగా ఉంటుందని వాష్ రూమ్ లో విషయంలో గానీ పడుకునేటప్పుడు హాస్టల్ గదులలో కానీ రీడింగ్ ఆల్ కావచ్చు తదితర విషయాలల్లో సమస్యలను ఎత్తుచూపుతో అన్ని విధాలుగా తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఏది ఏమైనా తిప్పర్తి మండలంలోని కస్తూర్బా గాంధీ హాస్టల్లోనే విద్యార్థినీలు ఇక్కడికి రావడం అన్ని విధాలుగా అసౌకర్యంగా ఉంటుందని అదేగాక జరిగితే తామంతా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

### ఎక్కడి వారిని అక్కడే ఉంచి చదువుకోవాలి హాస్టల్ విద్యార్థిని శివ రేణుక



చదువుకోవడానికి సుమారు 20 కిలోమీటర్ల దూరం నుండి వేములపల్లి మండల కేంద్రానికి వచ్చి చదువుకోవడానికి ఇబ్బందులు పడలేక ఇక్కడే ఉండి చదువుకోవాలని నిర్ణయించుకున్నాను. ఎంత కష్టమైనా ఇక్కడే ఉండి విద్యను అభ్యసిస్తున్నాను. ఇప్పటికే మోడల్ స్కూల్ హాస్టల్‌లో అరకొర సౌకర్యాల మధ్య ఇబ్బందులు పడుతున్నాము. బాత్రూం సౌకర్యం లేదు. స్టడీ రూమ్ లోను అన్ని విధాలుగా ఇబ్బంది పడుతున్నాము. ఇప్పుడు ఉన్న విద్యార్థినిలుతో ఇబ్బందిగాపడుతున్నామని, వేరేహాస్టల్ విద్యార్థినిలు మాతో జాయిన్ అయితే ఇంకా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.ఉన్నతాధికారులు అర్థం చేసుకొని ఎక్కడి వారిని అక్కడే ఉంచి చదువుకొనడానికిఅవకాశం కల్పించాలనిహాస్టల్‌విద్యార్థినిశివరేణుక కోరారు.

## దశాబ్దకాలంగా వివక్షే..

(1వ పేజీ తరువాయి)

రావాలన్న, పోవాలన్న ప్రజలు భయపడుతున్నారు. మోకాళ్ళ లోతు గుంతలు ఉండడంతో వర్షపునీరు నిలిచి తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై నాటి పాలకులకు గ్రామ ప్రజలు ఎన్నో సార్లు మొరపెట్టుకున్న పట్టించుకున్న పాపానపోలేదు.

### ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

గ్రామానికి చెందిన విద్యార్థులు పట్టణాల్లో చదువుకునేందుకు ప్రతి రోజు ఊరి నుండి స్కూల్ బస్సుల ద్వారా వెళ్తుంటారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్తున్న బస్సు బురదగుంతల్లో పడి ప్రమాదానికి గురైంది. బస్సు డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది.

### ఎమ్మెల్యే గారు.. మా ఊరికి రోడ్డు వేయరా!

దశాబ్ద కాలంగా వివక్షకు గురైన మా గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్‌ను వేడుకుంటున్నారు. గత పాలకులు మా పట్ల వివక్ష చూపారని అందుకే తమ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన తమరు మా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని మొరపెట్టుకుంటున్నారు.